క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ధన్వాడ: మండలంలోని గోటూర్ పంచాయతీలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల, సబ్ సెంటర్లను మండల పరిషత్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. సోమవారం గ్రామంలో జరుగుతున్న పనులు, పలు రికార్డులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాల్వల్లోనే తాగునీటి పైపులు



మాగనూర్: మండలంలోని వర్కూర్ గ్రామంలో తాగునీటి పైపులను మురుగుకాల్వల్లోనే బిగించారు. దీంతో మురుగునీరు తాగునీటి పైపుల్లోకి వెళ్తుండగా గ్రామస్తులు ఆ నీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ విషయంపై పలుసార్లు గ్రామస్తులు అధికారులు, గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రత్యేకాధికారి కనీసం నెలలో రెండుసార్లు అయినా గ్రామానికి రావడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు నిధులు లేవని అధికారులు దాటవేస్తుండడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ తగు చర్యలు తీసుకొని తాగునీటి పైపులైన్లకు మరమ్మతు చేపట్టి స్వచ్ఛమైన నీరు అందించాలని కోరుతున్నారు.

విజ్ఞాన ప్రదర్శనలో ధన్వాడ విద్యార్థిని



ధన్వాడ: దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగిన 11వ జాతీయ స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో ధన్వాడ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి స్వాతి తన ఉపాధ్యాయురాలు శైలజ సహకారంతో రూపొందించిన పాడి డ్రైయింగ్ టోల్‌ను ప్రదర్శించినట్లు హెచ్‌ఎం గాయత్రి తెలిపారు. తమ విద్యార్థిని జాతీయస్థాయి విజ్ఞాన ప్రదర్శన ఇవ్వడంపై సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలని ధర్నా



మక్తల్: పట్టణంలో తాగునీటి ఎద్దడిని నివారించాలని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కాలనీవాసులు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. మిషన్ భగీరథ నీళ్లు కొన్ని రోజులుగా రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనికి తోడు వచ్చిన కొంత నీటి సరఫరా కూడా సమయపాలన లేకుండా విడుదల చేస్తారని మండిపడ్డారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.

గుండెపోటుతో విద్యుత్ కార్మికుడి మృతి

మక్తల్: విద్యుత్ శాఖలో స్పాట్ బిల్లర్‌గా పని చేస్తున్న మక్తల్‌కు చెందిన కార్మికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్‌కు చెందిన తిరుపతి అంబ్రేస్ (45)విద్యుత్ శాఖలో స్పాట్ బిల్లర్‌గా పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు స్నేహితులతో పాటు నాయకులు ఆర్థికసాయం అందించారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



కొమ్మురు పాఠశాలలో బియ్యం స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నర్సింహారెడ్డి



పర్మన్‌దొడ్డి పాఠశాలలో..

మాగనూర్: తరగతి గదిలోని ప్రతి విద్యార్థిని పుస్తకాలు చదివే విధంగా ప్రోత్సహించాలని మాగనూర్ మండల నోడల్ అధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని వడ్వాట్, పర్మన్‌దొడ్డి పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు టైం టేబుల్ ప్రకారం విద్యార్థులకు పాఠాలు బోధించాలని అన్నారు. ముఖ్యంగా అందులో 45 నిమిషాలు పాఠ్యాంశం బోధించి మిగతా 45 నిమిషాలు వర్క్ బుక్ ప్రాక్టీస్ చేయించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి ఆయా తరగతులకు సంబంధించిన సామర్థ్యాలు రావాలని, లైబ్రరీ పీరియడ్‌ను కేటాయించాలన్నారు. విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ కృష్ణయ్య, ఉపాధ్యాయులు గోవర్ధన్, హుస్సేన్‌సాబ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని కొమ్మురు పాఠశాలలో ముక్కిన, పురుగుల బియ్యంతో మధ్యాహ్న భోజనం వండుతున్నారని పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించి ఎంపీడీఓ నర్సింహారెడ్డి సోమవారం పాఠశాలను సందర్శించారు. ఈ ముక్కిన బియ్యాన్ని వెంటనే ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని మధ్యాహ్న భోజన అధికారికి ఫోన్‌లో ఆదేశించారు. ఈ పాఠశాలకు వచ్చిన నాణ్యమైన బియ్యం మాత్రమే వినియోగించాలని, సిబ్బందికి, వంట ఏజెన్సీ వారికి సూచించారు. మండలంలోని పాఠశాల్లో ఇలాంటి బియ్యం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రామన్న, ఎంపీఓ సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దామరగిద్ద: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి భార్య అనసూయ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సోమవారం మండల కేంద్రంలోని బాల్‌రెడ్డి నివాసంలో ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైస్ చైర్మన్ కోనంగేరి హన్మంతు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు కందె చంద్రకాంత్, పేట పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎండీ సలీం, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, విండో అధ్యక్షుడు ఈదప్ప తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



దామరగిద్దలో మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోస్గి: మండలంలోని చంద్రవంచ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పాకాల ప్రభాకర్ వారం క్రితం మృతి చెందడంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ సాయిలు, కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి, దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ మహిపాల్ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన భవన నిర్మాణ కార్మికులు

ఊట్కూరు: హైదరాబాద్‌లో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు సోమవారం మండలంలోని ఊట్కూరు, పులిమామిడి, అవుసలోనిపల్లి, ఓబులాపూర్, పగిడిమారి తదితర గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో కార్మికులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు చెన్నప్ప మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలైన ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని నేరుగా కార్మికులకు కాకుండా ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పేందుకు ప్రయత్నించడం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో భవిష్యత్‌లో కార్మికులకు ఇన్సూరెన్స్ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణ, నాగేష్, కృష్ణయ్య, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గున్ముక్ల నుంచి తరలివెళ్తున్న ఐఎఫ్‌టీయూ భవన నిర్మాణ కార్మికులు

ధన్వాడ: చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గున్ముక్ల గ్రామానికి చెందిన ఐఎఫ్‌టీయూ భవన నిర్మాణ కార్మికులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. గున్ముక్ల నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఓ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం అభ్యంతరం వ్యక్తం చేశారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



హిందూపూర్‌లో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సహచరులు



ధన్వాడలో..

కృష్ణా: మండలంలోని హిందూపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అజయ్‌ను గ్రామ ప్రజలతో పాటు తోటి ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ పాఠశాల ఉపాధ్యాయుడు పీఆర్టీయూ టీఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, హనుమదాస్, గోనిపాటి వెంకటేష్, ఉమేష్, ప్రశాంతి, శివరాజ్, కస్తూరి పాల్గొన్నారు.

పేట మార్కెట్ యార్డు డైరెక్టర్‌కు..

ధన్వాడ: నారాయణపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపికైన లక్ష్మణ్‌గౌడ్‌ను సోమవారం ధన్వాడ మండల కేంద్రంలోని కంచుకోట అంజనేయస్వామి ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ధన్వాడ నుంచి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎంపిక చేయడంపై గౌడ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిపెట్టండి

కొల్లాపూర్: అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టిపెట్టాలని అంగన్‌వాడీ వర్కర్లకు సీడీపీఓ వెంకటరమణ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్త్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే ప్రతి ఒక్కరికి పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్లు స్వాతి, జయలలిత తదితరులు ఉన్నారు.



హాజరైన అంగన్‌వాడీ వర్కర్లు

భూనీడ్‌లో పౌష్టికాహార వారోత్సవాలు

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని భూనీడ్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను సోమవారం అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా భూనీడ్ సెక్టర్ పరిధిలోని గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు.



సర్దుబాటు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ఇటీవల జారీ చేసిన అసంబద్ధమైన మార్గదర్శకాలు సహేతుకం కాదని వెంటనే ఉపసంహరించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలం చెల్లిన 2015 నాటి రేషనలైజెషన్ నిబంధనల ప్రకారం 10 మంది విద్యార్థులకు ఒక టీచర్, 60 మంది వరకు ఇద్దరు టీచర్లు అనే నిబంధన అమలు చేయాలనుకోవడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడమే అవుతుందని, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే ఈ ఉత్తర్వులు ఇచ్చినట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. 20 మంది విద్యార్థుల వరకు ప్రతి బడికి ఇద్దరు టీచర్లను, తరువాత ప్రతి 20 మందికి ఒక టీచర్‌ను, 50 మంది పిల్లలు ఉన్న ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక హెచ్‌ఎం పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి తరగతికి ఒక టీచర్ ను నియమించినప్పుడే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రస్తుతం మెజారిటీ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయని, ఒక ఉపాధ్యాయుడు 5తరగతులకు ఎలా బోధించాలో అధికారులే తెలపాలని ప్రశ్నించారు. ప్రైవేటు పాఠశాలలకు మేలు చేయడానికి ఇలాంటి ఉత్తర్వులు ఇస్తున్నారా అని మండిపడ్డారు. జులైలో బదిలీ అయిన, పదోన్నతి పొందిన టీచర్ల జీతాలు ఇప్పటి వరకు వారి ఖాతాల్లో జమ కాలేదని, వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మండల నూతన సర్వేయర్‌గా రాజన్న



మాగనూర్: మండల నూతన సర్వేయర్‌గా రాజన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన మాగనూర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను కలిసి జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. మూడు నెలలుగా మాగనూర్ మండలానికి సర్వేయర్ లేకపోవడంతో రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని రోజుల తర్వాత మాగనూర్‌కు సర్వేయర్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సర్వేయర్ ప్రజలకు అందుబాటులో ఉంటు భూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయాలని తహసీల్దార్ తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మాగనూర్: మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని పాఠశాల జీహెచ్‌ఎం మురళీధర్‌రెడ్డి, పీడీ రాకేష్ అన్నారు. మాగనూర్ మండలంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అండర్-14 బాలుర కబడ్డీ పోటీలో మొదటి బహుమతి, అండర్-17 బాలికల కబడ్డీలో మొదటి స్థానం, ఖోఖో అండర్ 14, 17లో బాలురు మొదటి స్థానం, ఖోఖో అండర్ 14, 17 బాలికలు మొదటి స్థానం సాధించారని తెలిపారు.

మహిళలపై దాడి: కేసు నమోదు

అమరచింత: మండలంలోని కిష్టంపల్లిలో ఇద్దరు మహిళలను పరుశపదజాలంతో దూషిస్తూ దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. రెండు రోజుల కిందట కిష్టంపల్లిలో గ్రామానికి చెందిన బోయ చంద్రప్ప అనే వ్యక్తి ఆదే గ్రామానికి చెందిన ప్రమీల, అంజమ్మపై దాడి చేసి గాయపరచడంతో పరుశపదజాలంతో దూషించారని తెలిపారు. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి చంద్రప్పపై కేసు నమోదు చేశామన్నారు.

సిబ్బందికి వైద్య పరీక్షలు

నారాయణపేట రూరల్: మండలంలోని అభంగాపూర్లో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరం నిర్వహించినట్లు కోటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తులకు డెంగీ, మలేరియా తదితర రోగాలకు సంబంధించిన రక్త పరీక్షలు చేసి, స్వల్పకాలిక జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేశామన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. 82మందికి పరీక్షలు చేయగా 17మందికి స్వల్పకాలిక జ్వరం ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రాఘవేంద్రరెడ్డి, డాక్టర్లు చందన, శ్రుతి, సూపర్ వైజర్ శంకర్, బుగ్గేష్, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అభంగాపూర్‌లో..



కాన్‌కుర్తిలో..

దామరగిద్ద: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి కీర్తి ఆధ్వర్యంలో కాన్‌కుర్తి పంచాయతీ సిబ్బందికి రక్తపోటు, మధుమేహం, రక్తహీనత తదితర పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాన్‌కుర్తి ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు హరిచందన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

నారాయణపేట: కర్ణాటక యాదగిరి జిల్లా హున్సగి తాలూకా కొడేకల్‌లో దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేసినా నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్కడ ఉన్న దళితులను గ్రామం నుంచి బహిష్కరించడం, దళిత బాలికపై అత్యాచారం చేసిన నిందితులను అరెస్ట్ చేయకుండా అధికారులు, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కర్ణాటక యాదగిరి జిల్లా పోలీస్ యంత్రాంగం స్పందించి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈనెల 30న యాదగిరి జిల్లాలో జరిగే బంద్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమంతు, గడ్డం కష్టయ్య, చల్ల వెంకటేష్, అశోక్, భీమేష్, సిరిగిరి వెంకటేష్, రాజు, సిరిగిరి తాయప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళ్యాణ్ మాదిగ

రైతుల సంక్షేమమే ధ్యేయం



కోటకొండలో రైతులకు సభ్యత్వాన్ని అందిస్తున్న యాదగిరి

నారాయణపేట రూరల్: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా అభిరామి రైతు ఉత్పత్తిదారుల సంఘం పనిచేస్తుందని ఆ సంఘం చైర్మన్ యాదగిరి అన్నారు.మండలంలోని కోటకొండలో సోమవారం రైతులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ సెక్టార్ స్కీమ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతు సంఘాల ఏర్పాటు చేసి నాబార్డ్ సహాయంతో రైతులకు ఎంతో సహకారం అందిస్తుందన్నారు. రైతులు తమ వాటా ధనం రూ.వెయ్యి చెల్లించి సభ్యులుగా చేరితే సమానంగా ఒక్కొక్క సభ్యుడికి రూ. వెయ్యితో మొత్తం రూ.15 లక్షలను సంఘం ఖాతాలో జమ చేస్తుందని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరలకు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు ఉత్పత్తి చేసిన ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ వెంకటయ్య, అకౌంటెంట్ అశోక్, రైతులు కాశన్న, తాయప్ప, వెంకటయ్య, దస్తప్ప, దామోదర్, రఫీ, రెహమాన్, కాశీనాథ్ పాల్గొన్నారు.

తిరుమలకు పేరపళ్ల భజన బృందం

నారాయణపేట రూరల్: తిరుమల వెంకన్న సన్నిధిలో అడుగుల భజన ప్రదర్శించేందుకు మాజీ ఎంపీటీసీ శంకర్ ఆధ్వర్యంలో 30మంది పేరపళ్ల గ్రామం బురుజు హనుమాన్ అడుగుల భజన సభ్యులు మూడు ప్రత్యేక వాహనాల్లో సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీచుపల్లి హనుమాన్ ఆలయం ఎదుట 2గంటల పాటు భక్తి పాటలతో అడుగుల భజన ప్రదర్శించారు. అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బంది స్వామి వారి తీర్థప్రసాదాలను అందించి అభినందించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ పాడి పంటలతో దేశం సుభిక్షంగా ఉండాలని తిరుమల, కాణిపాకం, అరుణాచలం దేవస్థానాల్లో అడుగుల భజన ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హన్మంతు, బాలప్ప, భగవంతు, కిష్టప్ప, యల్లప్ప, కనకప్ప, అంజప్ప, రాజు పాల్గొన్నారు.



అడుగుల భజన ప్రదర్శిస్తున్న భక్తులు

దేశ హితం బీజేపీతోనే సాధ్యం



మక్తల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్న కొండయ్య

నారాయణపేట రూరల్: సనాతన ధర్మం, దేశ రక్షణ కోసం మేధావులు బీజేపీ సభ్యత్వం పొంది ప్రధాని నరేంద్రమోడీకి వెన్నుదన్నుగా నిలవాలని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత, క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ కోరారు. సోమవారం పట్టణ న్యాయవాదులతో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల దృష్ట్యా దేశ రక్షణ, మన సనాతన ధర్మ రక్షణ ఎంతో అవసరం అన్నారు. దేశాన్ని విదేశాల్లో అప్రతిష్ట పాలు చేసేలా దేశంలో అంతర్గంగా దెబ్బతీసేలా విపక్షాలు, కుహనా లౌకిక వాదులు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట్‌రెడ్డి, నందు నామాజీ, మదన్, కుర్మన్న గౌడ్, మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్రాములు, విజయ్, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగురావు నామాజీ



తలంకేరిలో..

మక్తల్: ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో ఆయన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, అఖిలారెడ్డి, ప్రసన్నరెడ్డి, మల్లికార్జున్, ప్రతాప్‌రెడ్డి, బాల్‌రాంరెడ్డి, మహేష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్‌దీక్షిత్, జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం యువకులు పార్టీ సభ్యత్వం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, మజ్జిగ సురేష్, ఉసేనప్ప, నర్సప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మాగనూర్ మండలంలో జోరుగా సాగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొల్ల నారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కోల్పూర్, అడవిసత్యావార్ గ్రామాల్లో 61, 99వ బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్, జయానందరెడ్డి, తాయప్పసాగర్, ఆనంద్, మహేష్, నర్సింహ, మహేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.